పెన్ పవర్
ఆదివారం అనుబంధం
అక్టోబర్ 26, 2025

# ఆ 2 MIN నిమిషాలే

# కీలకం



## లోపలి పేజీల్లో..

కవర్ పేజీ..




కర్నూలు జిల్లాలో చోటుచేసుకున్న బస్సు దుర్ఘటన అనేక కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగిల్చింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో శుక్రవారం తెల్లవారుజామున మంటలు చెలరేగి పలువురు సజీవ దహనమైన సంగతి తెలిసిందే.

› 07

### వారి అహంకారం ముందు మౌనంగా ఉండటమే మేలు: జాన్వీ కపూర్



వారి అహంకారం ముందు మౌనంగా ఉండటమే మేలు: జాన్వీ కపూర్ పురుషాధిక్య ప్రపంచంలో నెగ్గుకురావాలంటే కొన్నిసార్లు మౌనంగా ఉండాల్సి వస్తుందన్నారు నటి జాన్వీకపూర్..

› 12

### ఇన్‌స్టంట్ దోశ చట్నీ



› 10

దోశల్లో తినేందుకు చట్నీ చేయడానికి ఒక్కోసారి సమయం ఉండకపోవచ్చు. అలాంటప్పుడు చట్నీ ప్రీమిక్స్ సిద్ధంగా ఉందనుకోండి.. కాస్త పెరుగు, కొన్ని నీళ్లు జోడించి తాలింపు వేస్తే సరిపోతుంది. కొబ్బరి, కొత్తిమీరల ఇన్‌స్టంట్ చట్నీ మీ కోసం..

# నవంబర్ 1 నుంచి బ్యాంకు ఖాతాకు నలుగురు నామినీలు



దిల్లీ: బ్యాంకు ఖాతాలకు సంబంధించి కీలక మార్పు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఖాతాదారులు ఇకపై తమ ఖాతాకు నలుగురేసి నామినీలను నియమించుకోవచ్చు. దీనికి సంబంధించి బ్యాంకింగ్ చట్టాల సవరణ చట్టం, 2025లో మార్పులు చేసిన సంగతి తెలిసిందే. నామినేషన్‌కు సంబంధించిన కీలక నిబంధనలు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. తన మరణానంతరం అకౌంట్లో ఉన్న డబ్బును బ్యాంక్ ఎవరికి చెల్లించాలన్న విషయాన్ని వినియోగదారుడి ఖాతా తెరిచే సమయంలోనే తెలియజెప్పాలి. ప్రస్తుతం ఒకరినే బ్యాంక్ ఖాతాకు నామినీగా నియమించే వీలుంది. ఇకపై నలుగురిని నామినీలుగా పెట్టుకునేలా చట్ట సవరణ చేశారు. నామినీలను ఒకేసారి గానీ, ప్రాధాన్యతల ఆధారంగా ఒకరి తర్వాత ఒకరికి చెందేలా ఏర్పాటు చేసుకోవచ్చు. నూరు శాతంలో ఎవరికి ఎంత చెందాలో పేర్కొనడం ఒక పద్ధతి. నామినీలుగా పేర్కొన్న వ్యక్తుల్లో మొదటి వ్యక్తి మరణిస్తే రెండో వ్యక్తికి, రెండో వ్యక్తి మరణిస్తే మూడో వ్యక్తికి.. ఇలా సొమ్ము చేరేలా ఏర్పాటు చేసుకోవడం రెండోది. లాకర్లకూ ఇదే నిబంధన వర్తిస్తుంది. బ్యాంకింగ్ చట్టాల సవరణ చట్టాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 15న నోటిఫై చేశారు. ఇందులో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాక్ట్, 1934బీ బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949బీ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాక్ట్, 1955బీ బ్యాంకింగ్ కంపెనీస్ యాక్ట్, 1970, 1980కి సంబంధించి మొత్తం 19 సవరణల కోసం ఈ సవరణ చట్టం తీసుకొచ్చారు. దీనికి సంబంధించి జులైన 29 గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా.. దీంట్లోని కొన్ని ప్రావిజన్లు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. నామినేషన్‌కు సంబంధించిన నిబంధనలు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

### బంగారం మెరుపులు ఎందుకంటే?



04

### ఆగుదాం.. ఒక్క క్షణం!



5



### మీరు ప్రభాస్ గురించి కొన్ని తెలుసుకోవాల్సిందే...

ఎవరైనా ఎగతాళి చేస్తే పదే పదే దాని గురించే ఆలోచిస్తున్నారా? ఒక్క ఫెయిల్యూర్ ఎదురవగానే వెనుకడుగేస్తున్నారా? అయితే మీరు ప్రభాస్ గురించి కొన్ని తెలుసుకోవాల్సిందే... ఆయన ఎదిగిన తీరును ఓ గుర్తు చేసుకున్నట్లయితే..

06లో..

## ఎంట్రీ, ఎగ్జిట్‌లో ఫొటోలు.. అమెరికా మరో కొత్త రూల్

వలసల నియంత్రణ దిశగా ట్రంప్ యంత్రాంగం మరో నిర్ణయం తీసుకుంది. అమెరికాయేతర పౌరులు దేశం వీడే లేక దేశంలోకి అడుగుపెట్టే సమయంలో అధికారులు వారి ఫొటోలు తీయనున్నారు. గ్రీన్‌కార్డుదారులతో పాటు వలసదారులందరికీ ఈ కొత్త నిబంధన వర్తించనుంది. ఫెడరల్ రిజిస్టర్‌లో తాజాగా ఈ నిబంధనలను ప్రచురించారు. వాటి ఆధారంగా ఏ మార్గంలో అయినా దేశాన్ని వీడే, దేశంలోకి అడుగుపెట్టే వారి ఫొటోలు, డేటా సేకరణను యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ పెంచనుంది. ఫేక్ ట్రావెల్ పేపర్లను గుర్తించేందుకు, జాతీయ భద్రతను బలోపేతం చేసేందుకు డిసెంబర్ 26 నుంచి ఈ నిబంధనలను అమలు చేయనుంది. వివిధ మార్గాల్లో ఇమ్మిగ్రేషన్ చట్టాల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించేవారిని, వీసా గడువు ముగిసిన తర్వాత కూడా దేశంలోనే ఉంటున్నవారిని గుర్తించేందుకు వీలవుతుందని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఇక, 2021లోనే ఈ కొత్త నియంత్రణలు ప్రతిపాదించగా.. ఇప్పుడు పూర్తిస్థాయిలో సాంకేతికత ఉపయోగించి అక్రమవలసదారులకు చెక్ పెట్టనున్నారు.

12వ పేజీలో..

# విమానాల్లో పవర్ బ్యాంక్‌లపై నిషేధం?

**దేశీయ విమాన ప్రయాణాల్లో పవర్‌బ్యాంక్‌ల వాడకంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. విమాన ప్రయాణాల్లో వీటి వాడకాన్ని పూర్తిగా నిషేధించడం లేదా వాడకంపై కఠిన నిబంధనలు అమలు చేయడం వంటి అంశాలను పరిశీలిస్తోంది. ఇటీవల ఢిల్లీ విమానాశ్రయంలో జరిగిన ఇండిగో విమాన అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో ఈ సమగ్ర సమీక్ష చేపట్టింది.**



ఇటీవల ఢిల్లీ నుంచి దిమాపూర్‌కు బయలుదేరిన ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ పేలడంతో మంటలు చెలరేగాయి. సిబ్బంది వెంటనే అప్రమత్తమవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని ఇండిగో తెలిపింది. ప్రయాణికుడి వద్ద ఉన్న ఎలక్ట్రిక్ పరికరం పేలడం వల్లే విమానంలో మంటలు చెలరేగాయని, తర్వాత విమానాన్ని భద్రతా తనిఖీలు పూర్తి చేసి సాధారణ కార్యకలాపాలకు అనుమతించామని పేర్కొంది.

ఈ నేపథ్యంలో ఎయిర్‌లైన్స్ పవర్ బ్యాంకును ఎలా వాడుతున్నారనే అంశంపై డీజీసీఏ దృష్టిసారించింది. ఇందులో భాగంగా విమానంలో పవర్ బ్యాంక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించడం లేదా వాటి సామర్థ్యంపై పరిమితులు విధించడం లేదా కేవలం భద్రతా ప్రమాణాలు పాటించని పవర్ బ్యాంకులను మాత్రమే నిషేధించడం వంటి అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై పౌర విమానయాన మంత్రిత్వశాఖ, డీజీసీఏతో కలిసి కొత్త మార్గదర్శకాలు రూపొందించే ప్రయత్నంలో ఉంది.

ఇక అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ ఇప్పటికే కఠిన నిబంధనలు అమలు చేస్తున్నాయి. ఇటీవల ఎమిరేట్స్ విమానాల్లో పవర్ బ్యాంకుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించింది. ప్రయాణికులు 100 వాట్–అవర్‌ల కంటే తక్కువ సామర్థ్యం గల పవర్ బ్యాంకులు మాత్రమే తీసుకెళ్లవచ్చు. వాటిని విమాన ప్రయాణ సమయంలో ఛార్జ్ చేయడం, పరికరాలకు కనెక్ట్ చేయడాన్ని కఠినంగా నిషేధించింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్ కూడా ఏప్రిల్‌లో ఇలాంటి నిబంధనలు అమలు చేసింది. కేథే పసిఫిక్, ఖతార్ ఎయిర్‌వేస్ వంటి సంస్థలు కూడా పవర్ బ్యాంకులు ఎక్కడ ఉంచాలనే దానిపై కఠిన మార్గదర్శకాలు జారీ చేశాయి. పవర్ బ్యాంకుల్లో లిథియం–అయాన్ బ్యాటరీలు ఉండటం వల్ల అవి అధిక శక్తిని నిల్వ ఉంచగలవు. కానీ తక్కువ నాణ్యత గల చవక మోడళ్లు భద్రతా ప్రమాణాలు లేకుండా తయారు చేయడం వల్ల కొన్నిసార్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

# బంగారం మెరుపులు ఎందుకంటే?

**సంక్షోభ పరిస్థితులే ప్రధాన కారణం**

బంగారం ధర వెనక్కి తిరిగి చూడటం లేదు. రోజురోజుకీ పెరుగుతూనే ఉంది. పది గ్రాముల పసిడి (24 క్యారెట్లు) రూ.1.17- 1.20 లక్షల ధర పలికింది నిన్నమొన్ననే. అక్కడి నుంచి వారం రోజుల్లోనే రూ.1.35 లక్షలకు చేరినా, ధన త్రయోదశి (శనివారం) ముందురోజు కాస్త తగ్గి రూ.1,30,900 వద్ద ఉంది. కిలో వెండి కూడా రూ.1,71,600కు చేరింది. ఎందుకీ పరుగు, ఎన్నాళ్లీ మెరుపులు.. అని ఆభరణాలు కొందామనుకునేవారు చర్చించుకుంటున్నారు. మదుపరులు మాత్రం ఇంకా ధర పెరుగుతుందనే ఆశతో మేలిమి బంగారం బిస్కెట్లు కొనుగోలు చేస్తుండటంతో పాటు పసిడి ఈటీఎఫ్ (ఎక్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్స్)లలో, కమొడిటీస్ ఎక్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్‌పై పెట్టుబడులు పెడుతూనే ఉన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు, ఇతర సంకేతాలను గమనిస్తే.. బంగారం ధర పెరిగేందుకు అవకాశాలు ఎక్కువని.. అనుకోకుండా ఏదైనా జరిగితేనే ధర దిగివచ్చే అవకాశం ఉంటుంది.

**రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, ట్రంప్ విధానాలు, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లతో అందనంత ఎత్తుకు**

'డీ-డాలరైజేషన్ థీమ్' ప్రాచుర్యం పొందడమూ పసిడి ధరల పెరుగుదలకు ఒక కారణంగా ఉంది. అంతర్జాతీయ వాణిజ్య కరెన్సీగా డాలర్ స్థానంలో సొంత కరెన్సీలను ప్రోత్సహించడానికి వివిధ దేశాలు ప్రయత్నించడాన్ని డీ-డాలరైజేషన్‌గా పరిగణిస్తున్నారు. ఈ విధానం అమలుకు చైనా, రష్యా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వాణిజ్య విధానాలు, విధిస్తున్న సుంకాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రస్థానంపై సందేహాలు తలెత్తుతున్నాయి. దీంతో పలు దేశాలు డాలర్ బాండ్లలో పెట్టుబడులు తగ్గించి, బంగారం నిల్వలు పెంచుకుంటున్నాయి. ఇటీవల వివిధ కేంద్ర బ్యాంకులు బంగారం కొనుగోళ్లు అధికం చేయడానికి ఇదే ప్రధాన కారణం. మదుపర్లు డిజిటల్ పద్ధతుల్లో పెట్టుబడులు పెడుతున్నందున బంగారానికి అనూహ్య గిరాకీ ఏర్పడి, ధర పరుగులు తీస్తోంది.



## గతంలో ఏం జరిగింది?

ప్రపంచ వ్యాప్తంగా సంక్షోభ పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఆర్థిక మాంద్యం ముంచుకొచ్చినప్పుడు, యుద్ధాలు జరిగినప్పుడు బంగారం ధర పెరుగుతున్నట్లు చరిత్ర చెబుతోంది. సంక్షోభ పరిస్థితుల్లో ఆర్థిక భద్రత కోసం కేంద్ర బ్యాంకులు, సంస్థలు బంగారం కొని నిల్వ చేస్తాయి. ధర పెరిగి, లాభపడొచ్చని మదుపరులు బంగారంపై భారీగా పెట్టుబడులు పెడతారు. దీంతో ఒక్కసారిగా ధర పెరిగిపోతోంది. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత, 1970లో చమురు సంక్షోభం తలెత్తినప్పుడు, 2008లో ఆర్థిక మాంద్యం ముంచుకొచ్చినప్పుడు, కొవిడ్-19 ముప్పు తలెత్తినప్పుడు ఇలానే బంగారం ధర అమాంతం పెరిగింది. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. రష్యా- ఉక్రెయిన్ యుద్ధంతో బంగారం ధర పరుగు మొదలైంది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టాక, తీసుకున్న చర్యలతో ఆ పరుగు వేగవంతమైంది.

## ధర తగ్గుతుందా?

గతంలో బంగారం ధర అనూహ్యంగా పెరిగిన సందర్భాలను విశ్లేషిస్తే, పెరుగుదలకు తావిచ్చిన కారణాలు సద్దుమణిగాక.. దిగివచ్చింది. ఇప్పుడూ అది వర్తిస్తుంది. కానీ.. ధర ఇప్పటికిప్పుడు తగ్గుతుందని ఆర్థిక, పెట్టుబడి నిపుణులు చెప్పడం లేదు. ప్రస్తుత తరుణంలో పసిడి ధర తగ్గాలంటే 'రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ఆగాలి. ట్రంప్ సుంకాల ప్రభావం, ఆర్థిక మందగమనం విషయంలో స్పష్టత రావాలి. డాలర్ బలపడాలి. వడ్డీరేట్లు పెరగాలి. ద్రవ్యోల్బణం తగ్గాలి. కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కొనడం తగ్గించాలి' అని నిపుణులు పేర్కొంటున్నారు. ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర గత 7 నెలల్లోనే 1,000 డాలర్లు పెరిగింది. అంతే వేగంగా ధర పతనమయ్యే అవకాశాలు తక్కువ.

## ఈసారి ఆభరణాలకు బదులు..

ఆభరణాలు కొనడానికి ధనత్రయోదశిని మెరుగైన సందర్భంగా భావిస్తుంటారు. ప్రస్తుత అధిక ధరలతో ఆభరణాల కొనుగోళ్లు మందగించి, బంగారం నాణేలు-బిస్కెట్ల విక్రయాలు పెరిగాయి. కొద్దికాలం పాటు 10 గ్రాముల బంగారం (24 క్యారెట్లు) ధర రూ.1.30- 1.35 లక్షల శ్రేణిలో కదలాడే అవకాశం ఉన్నట్లు నిపుణులు భావిస్తున్నారు. ధర 5-10% తగ్గుతుందనే అంచనాలూ ఉన్నాయి. రూ.1.21 లక్షల (ఔన్సు ధర 4,000 డాలర్ల) వద్ద బంగారం ధరకు గట్టి మద్దతు ఉన్నట్లు, అంతకంటే ధర దిగివస్తే స్వల్పకాలిక దిద్దుబాటు ఉంటుందని సంబంధిత వర్గాలు విశ్లేషిస్తున్నాయి.?



లేస్తూనే మీటింగ్‌లు, ప్రాజెక్టులు, టార్గెట్‌లు... వీకెండ్ వస్తే స్నేహితులు, పార్టీలు, గేమ్స్..
ఈ మధ్యలోనే సోషల్‌మీడియా, నెట్‌ఫ్లిక్స్... ప్రపంచంలో జరిగే విశేషాలు..
అన్నీ తెలుసుకోవాలి! అందరికన్నా మెరుగ్గా ఉండాలనే ఆలోచనలో...
విరామ సమయంలోనూ ఒత్తిడి నెత్తినేసుకుంటున్నాం!
అందుకే...ఆగుదాం... ఒక్క క్షణం..
ప్రస్తుతంలో ఉంటూ..కాసేపు పనులను పక్కనబెట్టి..
శరీరాన్ని.. మనసును తేలికపరుచుకుందాం!

# ఉరుకులు, పరుగుల జీవితంలో..

# ఆగుదాం.. ఒక్క క్షణం!



ఎక్కడికైనా ఎవరికైనా సెకన్లలో సందేశాన్ని పంపించగల్గుతున్నాం. ప్రపంచ వింతలన్నింటినీ అరచేతిలోంచే చూడగలుగుతున్నాం. కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్... ఫలితంగా మనిషి జీవితంలో పరుగే పరుగు. అంతిమంగా.. బర్నవుట్! విరామానికి చోటేలేదు! పైగా వేగం ఉంటేనే విజయం. నెమ్మదించడం అనేది వెనకబాటుతనంగా భావిస్తున్నారంతా. సాధారణ ఉద్యోగి నుంచి సీఈఓల వరకూ అందరిదీ ఒకటే పరిస్థితి. ఉత్పాదకత పెరగాలి, సంపాదించాలి. అంటే పరుగెత్తాల్సిందే. కానీ అదే వద్దు అంటున్నారు నిపుణులు.



## పని చేయొద్దని కాదు

నెమ్మదించడం సోమరితనానికీ సంతృప్తికీ సంకేతం కాదు. ఇదో చిన్న విరామం... అప్పుడే స్పష్టతతో ఆలోచించగలం. ముఖ్యమైన అంశంపై దృష్టి పెట్టగలం. ఉత్పాదకతను రెట్టింపు చేయగలం. తాబేలుకుందేలు కథ తెలుసు కదా. వేగంగా పరుగెడితేనే లక్ష్యాన్ని చేరుకుంటామనేది అపోహ. నిజం చెప్పాలంటే వేగాన్ని తగ్గించడం అనేది మనలోని శక్తిని కాపాడుకోవడమే. అత్యుత్తమ బ్యాట్స్‌మన్... ప్రతి బాల్‌నీ సిక్సర్ కొట్టి, త్వరగా అవుటైపోవాలనుకోడు. బంతి వేగాన్ని బట్టి ఆడుతూ ఎక్కువసేపు క్రీజ్‌లో ఉండి లక్ష్యాన్ని చేరుకోవాలనుకుంటాడు. జట్టుని విజయం వైపు తీసుకెళతాడు. నెమ్మదించడం కూడా ఇలాంటిదే!

## లాభాలెన్నో!

- వేగం తగ్గించడం వల్ల మైండ్‌ఫుల్ లివింగ్ అలవడుతుంది. మనకేం కావాలో తెలుస్తుంది. పనిలో పూర్తిగా నిమగ్నమవడం నేర్చుకుంటాం.
- మల్టీటాస్కింగ్ మంచిదనుకుంటాం కానీ కాదు, తింటున్నా నిద్రపోతున్నా... మధ్యమధ్యలో మెసేజ్‌లు చెక్ చేస్తుంటాం. మర్నాటి టాస్క్‌ల గురించి ఆలోచిస్తుంటాం. దీనివల్ల సరైన నిర్ణయం తీసుకోలేం. సృజన, జ్ఞాపకశక్తి తగ్గిపోతాయి. ఎందుకంటే మెదడు వర్తమానాన్ని మరిచి, తరవాతేంటి అన్నదే ఆలోచిస్తుంటుంది. అందుకే, మల్టీటాస్కింగ్ వల్ల అసలైన ఉత్పాదకత తగ్గి, 40 శాతం తప్పులు చేస్తామని అధ్యయనాలు చెబుతున్నాయి.
- బిజీ లైఫ్‌ని తగ్గించుకుని ఆప్తులతో గడపడం వల్ల బంధాలు బలపడతాయి. జ్ఞాపకాలను పోగేసుకోవచ్చు. ఇది జీవితం పట్ల సంతృప్తిని పెంచుతుంది.
- చిన్న విరామంతో బుజ్జి పిట్ట పలకరింపు, గాలి సవ్వడి, ఊగే కొమ్మల సన్నాయి... అనుభవంలోకి వచ్చే ప్రతి క్షణాన్నీ ఆనందించడం నేర్చుకుంటాం. దాంతో ఒత్తిడి తగ్గి శక్తిమంతమైన నిర్ణయాలు తీసుకోగలుగుతాం. కాబట్టి మనకోసం, మానసిక ప్రశాంతత కోసం సమయం కేటాయించుకుందాం.
- నడిచేటప్పుడూ కొన్ని పనులు చేసేద్దాం అనుకుని పాడ్‌కాస్ట్‌లు వింటుంటాం. పరధ్యానం అసలే వద్దు. మన ఆలోచనలతోనే గడుపుదాం. ఐదు, పది నిమిషాలు మౌనంగా కూర్చుని కళ్లు మూసుకుందాం. మెదడు స్క్రీన్ మీదకొచ్చే ఆలోచనల్ని జాగ్రత్తగా గమనించి, ఒడిసి పట్టుకుందాం.
- అనుక్షణం టాస్క్‌లతో పరుగెత్తకుండా... స్నేహితులతో కప్పు కాఫీ, ప్రకృతిలో నడక, మంచి పుస్తకం.. ఇలా ప్రతి క్షణాన్నీ ఆస్వాదిస్తూ జీవిద్దాం... మైక్రో పాజ్‌లు ఎప్పుడూ మంచివే!




**ఎవరైనా ఎగతాళి చేస్తే పదే పదే దాని గురించే ఆలోచిస్తున్నారా? ఒక్క ఫెయిల్యూర్ ఎదురవగానే వెనుకడుగేస్తున్నారా? అయితే మీరు ప్రభాస్ గురించి కొన్ని తెలుసుకోవాల్సిందే... ఆయన ఎదిగిన తీరును ఓ గుర్తు చేసుకున్నట్లయితే..**





- ప్రభాస్ సినీ ప్రయత్నాలు మొదలుపెట్టే క్రమంలో.. 'నువ్వు హీరో ఏంట్రా బాబూ' అంటూ ఎగతాళి చేసిన వారెందరో.. అలాగని నిరుత్సాహపడలేదు. కసితో నటనలో శిక్షణ పొంది, ఈ స్థాయికి చేరుకున్నారు. మిమ్మల్ని హేళన చేసిన వారికి... మాటల్లో కాదు మీ పనితో సమాధానమిచ్చేప్రయత్నం చేయండి.

- ప్రభాస్ సినీ ప్రయత్నాలు మొదలుపెట్టే క్రమంలో.. 'నువ్వు హీరో ఏంట్రా బాబూ' అంటూ ఎగతాళి చేసిన వారెందరో.. అలాగని నిరుత్సాహపడలేదు. కసితో నటనలో శిక్షణ పొంది, ఈ స్థాయికి చేరుకున్నారు. మిమ్మల్ని హేళన చేసిన వారికి... మాటల్లో కాదు మీ పనితో సమాధానమిచ్చే ప్రయత్నం చేయండి.

- అరడుగులు ఏంటి యూజ్ అనుకున్న ప్రభాస్‌కు ఎత్తు విలువేంటన్నది సినిమాల్లోకి వచ్చిన తర్వాతే అర్థమైందట. అలాగే మీ విషయంలో మీరు పెద్దగా పట్టించుకోనిది ఎప్పుడో ఒకప్పుడు ప్లస్ కావాచ్చు.

- భయ్యా.. బ్రదర్ అని పిలవడాన్ని ఇబ్బందిగా ఫీలై వఅందరినీ డార్లింగ్ అంటూ తన మార్క్ చూపించారు. రొటీన్‌కు భిన్నంగా వెళితే మీరూ ఓ బ్రాండ్‌గా మారొచ్చు.

- ప్రభాస్‌కు సిగ్గు ఎక్కువే.కానీ, కెమెరా యాక్షన్ అని వినిపించగానే అది మాయమవుతుంది. పని విషయంలో మీరూ బిడియాన్ని వీడి మార్పుని గమనించండి.

- **సొంత లాభం కొంత మానుకుని.. పొరుగువారికి సాయపడే వ్యక్తి. ఎన్ని రూ. కోట్లు విరాళమిచ్చినా డాబు, దర్పం ప్రదర్శించరు.**
- ఖాళీ సమయాన్ని ఎక్కువగా పుస్తక పఠనానికే కేటాయిస్తారు. దాని వల్ల మానసికంగా చాలా మార్పు చూశారట. మీరూ బుక్ రీడింగ్‌తో వచ్చే ప్రయోజనాలు పొందండి.

- కెరీర్‌లో ప్రారంభంలో వరుసగా రెండు పరాజయాలు.. తనపై తనకున్న నమ్మకాన్ని కోల్పోకుండా చేసిన మూడో చిత్రం కలెక్షన్ల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే..

- మళ్లీ మరో రెండు ఫ్లాప్స్, ఓ సూపర్‌హిట్.. రిపీట్, ఫెయిల్యూర్‌కి కుంగిపోకుండా సక్సెస్‌కు పొంగిపోకుండా పనిచేసుకుంటూ వెళ్లడం ప్రభాస్ ఫిలాసఫీ..

- ఒక స్టార్ హీరో ఒక్క సినిమా (బాహుబలి)కోసం ఐదేళ్లు వెచ్చించడం మామూలు విషయం కాదు. ఆ కీలక నిర్ణయం ఆయన్నే కాదు టాలీవుడ్‌నూ మరో స్థాయికి తీసుకెళ్లింది. లాభాలేంటి?

డిజైన్ లోపం..

# ఆ 2 నిమిషాలే కీలకం

# స్లీపర్‌లో ఎందుకీ ప్రమాదాలు..?

కర్నూలు జిల్లాలో చోటుచేసుకున్న బస్సు దుర్ఘటన అనేక కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగిల్చింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో శుక్రవారం తెల్లవారుజామున మంటలు చెలరేగి పలువురు సజీవ దహనమైన సంగతి తెలిసిందే. సరిగ్గా 10 రోజుల క్రితం రాజస్థాన్‌లోనూ ఇదేతరహా ప్రమాదం జరిగి 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇవే కాదు.. గత కొన్నేళ్లుగా స్లీపర్ బస్సుల్లో జరుగుతోన్న ప్రమాద ఘటనలు ప్రయాణికుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. వీటి నిర్వహణకు కఠిన నిబంధనలు తీసుకురావాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. మరి ఈ ప్రమాదాలకు కారణాలేంటి..?

## డిజైన్ లోపమేనా..?

సాధారణంగా స్లీపర్ బస్సుల్లో 2x1 సీటింగ్ ఉంటుంది. 30 నుంచి 36 బెర్త్‌లు ఉంటాయి. అదే మల్టీ యాక్సిల్ బస్సులైతే 36-40 మంది ప్రయాణించవచ్చు. ఒక్కో బెర్త్ ఆరు అడుగుల పొడవు.. 2.6 అడుగుల వెడల్పులో ఉంటుంది. అయితే బెర్త్‌లను అనుసంధానించే గ్యాలరీతోనే ఇక్కడ సమస్య. ఈ గ్యాలరీలు చాలా ఇరుకుగా ఉండటంతో ఒకసారి ఒక వ్యక్తి మాత్రమే వెళ్లడానికి వీలుంటుంది. ప్రమాదాల సమయంలో ప్రయాణికులు ఈ ఇరుకైన ప్రాంతం నుంచి వేగంగా బయటకు రాలేకపోతున్నారు. స్లీపర్ బస్సుల్లో ప్రయాణం సౌకర్యవంతంగానే ఉంటున్నా.. సీట్ల మధ్యలో పరిమిత స్థలం వల్ల ప్రయాణికుల కదలికలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్లే ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువమంది లోపల చిక్కుకుపోతున్నారని అభిప్రాయపడుతున్నారు.

ఇక, స్లీపర్ బస్సుల ఎత్తు కూడా మరో సమస్యగా మారుతోంది. సాధారణంగా వీటి ఎత్తు 8-9 అడుగుల వరకు ఉంటోంది. ఒకవేళ బస్సు ఉన్నట్టుండి ఒక వైపునకు ఒరిగిపోయినప్పుడు.. ప్రయాణికులు కిటికీలను లేదా ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లను చేరడం కష్టంగా మారుతోంది. ఈ ఎత్తు వల్ల రెస్క్యూ ఆపరేషన్‌కు కూడా ఆటంకం కలుగుతోంది. బస్సు ఎక్కి ప్రయాణికులను బయటకు తీసేలోపు మృతుల సంఖ్య పెరుగుతోందని నిపుణులు భావిస్తున్నారు.





## ఆ రెండు నిమిషాలే కీలకం..

ప్రమాదాల సమయంలో మొదటి రెండు నిమిషాల్లో ప్రతిస్పందించే తీరే అత్యంత కీలకమని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా స్లీపర్ బస్సుల్లో ఎక్కువ మంది ప్రయాణికులు నిద్రలోనే ఉంటారు. సీట్లలో మెలకువగా ఉన్నవారు లేదా ప్రమాదం జరిగిన వెంటనే తేరుకున్న వారు ప్రాణాలతో బయటపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక, అప్పర్ బెర్త్‌ల్లో ఉన్నవారు బయటపడటం చాలా క్లిష్టంగా ఉంటోందని అంటున్నారు.

## చైనాలో నిషేధం..

ఈ స్లీపర్ బస్సులు తొలుత పశ్చిమదేశాల్లో నడిపేవారు. సిటీల మధ్య వినోద ప్రయాణాల కోసం వీటిని వినియోగించేవారు. ఆ తర్వాత సాధారణ ప్రజా రవాణాలో ఇవి భాగమయ్యాయి. అయితే, వీటిల్లో జరుగుతోన్న ప్రమాదాల కారణంగా కొన్ని దేశాలు స్లీపర్ బస్సుల వినియోగాన్ని తగ్గించుకుంటున్నాయి. చైనాలో 2009 తర్వాత నుంచి 13 స్లీపర్ బస్సు ప్రమాదాలు జరిగి 252 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో 2012లో వీటి రిజిస్ట్రేషన్లను చైనా నిలిపివేసింది.



## అలసట.. మగత..

300 నుంచి 1000 కిలోమీటర్ల దూరం ఉండే ప్రయాణాలకు స్లీపర్ బస్సులను అధికంగా వినియోగిస్తున్నారు. సాధారణంగా ఈ బస్సులు రాత్రి వేళల్లోనే ఎక్కువగా ప్రయాణిస్తాయి. దీంతో డ్రైవర్‌కు అలసట లేదా మగత వచ్చే ముప్పు కూడా ఎక్కువగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. అధునాతన బస్సుల్లో డ్రౌజీనెస్ అలర్ట్ సిస్టమ్‌లను ఏర్పాటుచేస్తున్నా.. వాటి పనితీరు, సామర్థ్యంపై ఇంకా అనుమానాలు ఉన్నాయి. డ్రైవింగ్ సమయంలో తాము నిద్ర మత్తులో ఉంటున్నామని 25శాతం మంది డ్రైవర్లు అంగీకరించినట్లు 2018లో నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైంది. అర్ధరాత్రి తర్వాత నుంచి ఉదయం 6 గంటల్లోపు డ్రైవర్లు నిద్రలోకి జారుకునే అవకాశం ఉందని పలు అధ్యయనాలు పేర్కొన్నాయి.







# సౌందర్య సంరక్షణకు.. మునగ నూనె!

అందంగా మెరిసిపోవాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటాం. వంటింట్లో లభించే సహజసిద్ధమైన పదార్థాల్నీ సౌందర్య పోషణ కోసం ఉపయోగిస్తాం. వీటిలో మునగ నూనెను కూడా చేర్చుకోమంటున్నారు నిపుణులు....

అందంగా మెరిసిపోవాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటాం. వంటింట్లో లభించే సహజసిద్ధమైన పదార్థాల్నీ సౌందర్య పోషణ కోసం ఉపయోగిస్తాం. వీటిలో మునగ నూనెను కూడా చేర్చుకోమంటున్నారు నిపుణులు. మునగ గింజలను ఎండబెట్టి, వాటి నుంచి తీసిన ఈ నూనె అందాన్ని ద్విగుణీకృతం చేయడంలో సమర్థంగా పనిచేస్తుందంటున్నారు. అదెలాగో తెలుసుకుందాం రండి..

## మెరిసే చర్మానికి..

మునగ నూనెను చర్మానికి రాసుకోవడం వల్ల కాలుష్య ప్రభావంతో పాడైన చర్మాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావచ్చు. అలాగే రోజువారీ పనుల వల్ల కలిగే అలసట, ఒత్తిళ్ల నుంచి కూడా ఇది ఉపశమనం కలిగిస్తుంది. ఇక ఈ నూనెను తరచూ ఉపయోగిస్తే చర్మం మృదువుగా మారడమే కాకుండా ప్రకాశవంతంగానూ కనిపిస్తుంది అంటున్నారు నిపుణులు.

## తేమనందిస్తుంది..!

పొడిచర్మతత్వం ఉన్న వారికి ఈ నూనె మేలు చేస్తుంది. ఇది నేరుగా చర్మం లోపలి పొరల్లోకి ఇంకి తేమనందిస్తుంది. అలాగని జిడ్డుగా అనిపించదు. అలాగే పగిలిన పెదవులకు కూడా దీన్ని అప్లై చేసుకుంటే అవి తిరిగి మృదువుగా మారతాయి. ఇందులో ఉండే ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్లు, ఖనిజాలు.. చర్మానికి తగినంత తేమతో పాటు పోషణ కూడా అందిస్తాయి.

## వృద్ధాప్య ఛాయలు కనిపించకుండా..

మునగ నూనెలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి చర్మం నవయవ్వనంగా, ఆరోగ్యంగా కనిపించేలా చేస్తాయి. అలాగే ఇందులోని విటమిన్ 'సి' కొలాజెన్ ఎక్కువగా ఉత్పత్తయ్యేలా చేసి చర్మం ముడతలు పడకుండా సంరక్షిస్తుంది. కాబట్టి వృద్ధాప్య ఛాయలు దరిచేరకుండా జాగ్రత్తపడచ్చు.. స్నానం చేసిన తర్వాత ఈ నూనెతో చర్మానికి మృదువుగా మర్దన చేసుకోవడం వల్ల రోజంతా తేమ నిలిచి ఉంటుంది. పగటి పూట ఇబ్బంది అనుకునేవారు రాత్రి పూట నిద్రపోయే ముందు కూడా ఈ నూనెను చర్మానికి రాసుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

## మచ్చలకు చెక్!

మునగ నూనెలో విటమిన్ 'సి', 'ఇ' సమృద్ధిగా లభిస్తాయి. ఇవి చర్మంపై ఉండే మచ్చలు పూర్తిగా తొలగిపోయేలా చేస్తాయి. కాబట్టి చర్మంపై ఉండే నల్లమచ్చలు, మొటిమల వల్ల ఏర్పడిన మచ్చలు, పిగ్మెంటేషన్.. వంటి సమస్యలకు ఇది చక్కని పరిష్కారం చూపుతుంది. అలాగే ఈ నూనెలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీసెప్టిక్ గుణాల వల్ల చర్మంపై కాలిన మచ్చలు, గాయాలు.. వంటివి త్వరగా నయమవుతాయి.

## కురులకు..

మునగ నూనె కేవలం చర్మానికే కాదు.. కురులకు కూడా తేమనందిస్తుంది. ఇందుకోసం కాస్త మునగ నూనె తీసుకొని కేశాలు తడిగా ఉన్నప్పుడు కుదుళ్లలోకి చేరేలా మృదువుగా మర్దన చేయాలి. ఈ నూనెని తరచూ ఉపయోగించడం వల్ల దృఢమైన కురులు సొంతం చేసుకోవచ్చు. అలాగే చుండ్రు, చిట్లిన చివర్లు.. వంటి సమస్యల నుంచి కూడా ఉపశమనం పొందచ్చు.



## ఇవి కూడా!

- మునగ నూనెని ఫేషియల్ క్లెన్సర్‌గా కూడా ఉపయోగించవచ్చు అంటున్నారు నిపుణులు.
- యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉండే ఈ నూనె ఎండ వల్ల కమిలిన చర్మాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకొస్తుంది.
- దీన్ని హెయిర్ సీరమ్‌గా కూడా వినియోగించచ్చు.







# బాలీవుడ్ నటుడు సతీష్ షా కన్నుమూత



హిందీ చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో అలరించిన సతీష్ షా (74) కన్నుమూశారు 'జానేబీ దో యారో', 'మై హూనా' తదితర చిత్రాలతో పాటు, 'సారాబాయ్ వర్సెస్ సారాబాయ్' వంటి టీవీ షోలతోనూ ఆయన అలరించారు. గత కొంతకాలంగా సతీష్ కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆయనకు ఆయనకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కూడా జరిగింది. శనివారం సతీష్ షా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచినట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి.



## దూసుకొస్తున్న 'మొంథా' తుపాను..

# ఏపీకి రెడ్ అలెర్ట్



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కి తుపాను ముప్పు పొంచి ఉంది. దూసుకొస్తున్న 'మొంథా' తుపాను.. రాష్ట్రంలో తీరం దాటే అవకాశం ఉంది. దీంతో ఏపీకి వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అక్టోబర్ 26, 27, 28, 29 తేదీల్లో తుపాను చాలా ప్రభావం చూపిస్తుందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ నెల 28న సాయంత్రం కాకినాడ సమీపంలో తీవ్రమైన తుపానుగా తీరం దాటే అవకాశం ఉందని అమరావతి వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. విశాఖపట్నం-తిరుపతి వరకూ దీని ప్రభావం ఉండనుంది. హైదరాబాద్ సహా తెలంగాణలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ఏపీలోని తీర ప్రాంత జిల్లాల్లో ఉన్న విద్యా సంస్థలకు 28, 29 తేదీల్లో సెలవు ప్రకటించాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు ప్రయాణాలు మానుకోవాలని పేర్కొన్నారు.

భారీ వర్షాలు కురవనుండటంతో మచిలీపట్నం, దివిసీమ, విజయవాడ, గుంటూరు, ఏలూరు, గోదావరి జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



# తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్..

తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్మీడియట్ సిలబస్‌లోనూ ఇంటర్ బోర్డు ఈసారి మార్పులు చేసింది. ఇంటర్ మొదటి సంవత్సరంలోనూ ల్యాబ్స్, ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉండనున్నాయి.



# తండ్రి కాబోతున్న దగ్గుబాటి హీరో

టాలీవుడ్ హీరో రానాతండ్రి కాబోతున్నారు. త్వరలోనే దగ్గుబాటి ఇంట్లోకి వారసుడు/ వారసురాలు రాబోతున్నారు. రానా సతీమణి మిహిక బజాజ్ గర్భం దాల్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయాన్ని రానా ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఓ మంచి రోజు చూసి ఈ గుడ్ న్యూస్‌ని తన అభిమానులతో పంచుకోవాలని రానా భావిస్తున్నారట. గతంలోనూ మిషికా ప్రెగ్నెంట్ అంటూ నెట్టింట ప్రచారం జరిగింది. ఈ వార్తలను రానా దంపతులిద్దరూ కొట్టిపారేశారు. చాలా కాలం తర్వాత మరోసారి రానా తండ్రి కాబోతున్నారనే వార్తలు వచ్చాయి. ఈ సారి కూడా పుకారుగానే మిగిలిపోతుందా? లేదా నిజంగానే రానాకి ప్రమోషన్ వచ్చిందా అనేది తెలియాలంటే వాళ్లు స్పందించేవరకు ఆగాల్సిందే. రానా, మిహికాలది ప్రేమ వివాహం. ముంబైలో ఇంటీరియర్ డిజైనర్‌గా పని చేసే మిహీకా స్వస్థలం హైదరాబాద్. చిన్నప్పటి నుంచి ఒకరికొకరు తెలుసు. కానీ లాక్‌డౌన్ సమయంలో వీరిద్దరు ప్రేమలో పడినట్లు ఓ ఇంటర్వ్యూలో రానా చెప్పారు. వీరిద్దరి పెళ్లి 2020 ఆగస్టు 8న జరిగింది. పెళ్లి తర్వాత ఈ జంట ఎక్కువగా ముంబైలోనే ఉంటుంది. రానా వారసత్వంగా వస్తున్న వ్యాపారాలను చూసుకుంటూనే.. నిర్మాతగా, నటుడిగానూ కొనసాగుతున్నాడు.

# తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా నాగుల చవితి














## వారి అహంకారం ముందు

# మౌనంగా ఉండటమే మేలు: జాన్వీ కపూర్



వారి అహంకారం ముందు మౌనంగా ఉండటమే మేలు: జాన్వీ కపూర్  పురుషాధిక్య ప్రపంచంలో నెగ్గుకురావాలంటే కొన్నిసార్లు మౌనంగా ఉండాల్సి వస్తుందన్నారు నటి జాన్వీకపూర్ (%ఝఅష్ట్రజఱ ఖుజూశీశీతీ%). తాను ఎన్నోసార్లు అలా ఉన్నానని చెప్పారు. పరిశ్రమలో కొన్నిసార్లు ఎదుర్కొంటోన్న సమస్యలపై ఆమె 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' టాక్ షోలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దర్శకనిర్మాత కరణ్‌జోహార్‌తో కలిసి జాన్వీ సందడి చేశారు. "సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి ఇండస్ట్రీకి వచ్చాను. అయినప్పటికీ కొన్ని విషయాలు ఇక్కడికి వచ్చాకే నేర్చుకున్నాను. ఇక్కడ కొనసాగాలంటే పురుష అహంకారాని ఎదుర్కోవాలి. నలుగురు మహిళలు ఉన్న ప్రదేశంలో నేను ధైర్యంగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేయగలను.. కానీ, అదే ప్రదేశంలో నలుగురు పురుషులు ఉంటే మాత్రం నేను నా అభిప్రాయాన్ని వ్యక్తంచేయలేను. ఎందుకంటే వారు నొచ్చుకోకుండా వెల్లడించాల్సి ఉంటుంది. దీనికి చాలా నేర్పు ఉండాలి. నేను ఈ విషయంలో ఎన్నో పోరాటాలు చేశాను. ఒక్కోసారి మనల్ని మనం తక్కువ చేసుకోవాలి. ఎంత గొప్పగా నటించే సామర్థ్యం ఉన్నప్పటికీ అవతలి వారి కోసం కొంచెం తగ్గి నటించాల్సి వస్తుంది. అలాగే మరికొన్నిసార్లు మనకు నచ్చని విషయాలను 'ఇది నాకు నచ్చలేదు.. నేను చేయను' అని చెప్పే బదులు.. నాకు అర్థం కావడం లేదు అని చెప్పాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఎన్నో రాజకీయాలను ఎదుర్కోవాలి" అని జాన్వీకపూర్ చెప్పారు. ఈ విషయాలన్నీ ఆ షో వ్యాఖ్యాతల్లో ఒకరైన ట్వింకిల్ ఖన్నా అంగీకరించారు. తాను కూడా 1990ల్లో పరిశ్రమలో ఉన్నప్పుడు ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఈ విషయం తనకు ఇప్పటికీ అర్థం కాదని పేర్కొన్నారు. ఇటీవల కూడా జాన్వీకపూర్ నెపోటిజం గురించి తన అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పారు. బయట వ్యక్తుల కష్టాలు వినడానికి అందరూ ఆసక్తి చూపుతారు కానీ, ఇండస్ట్రీకి చెందినవారు ఇబ్బందులు పడుతున్నామంటే ఎవరూ వినరని తెలిపారు. స్టార్ కిడ్స్ ఇబ్బందులు చెప్పినా విడ్డూరంగా ఉంటాయన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. తాజాగా జాన్వీ రొమాంటిక్ కామెడీ చిత్రం 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' తో పలకరించారు. ప్రస్తుతం రామ్‌చరణ్-బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న 'పెద్ది'లో నటిస్తున్నారు. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీని షెడ్యూల్ శ్రీలంకలో జరుగుతోంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో క్రీడా నేపథ్యమున్న అంశాలకు ప్రాధాన్యం ఉంది. టైటిల్‌కు తగ్గట్లుగానే ఇందులో చరణ్ కూలీగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది.

## ఎంట్రీ, ఎగ్జిట్‌లో ఫొటోలు..



## అమెరికా మరో కొత్త రూల్

వలసల నియంత్రణ దిశగా ట్రంప్ యంత్రాంగం మరో నిర్ణయం తీసుకుంది. అమెరికాయేతర పౌరులు దేశం వీడే లేక దేశంలోకి అడుగుపెట్టే సమయంలో అధికారులు వారి ఫొటోలు తీయనున్నారు. గ్రీన్‌కార్డుదారులతో పాటు వలసదారులందరికీ ఈ కొత్త నిబంధన వర్తించనుంది. ఫెడరల్ రిజిస్టర్‌లో తాజాగా ఈ నిబంధనలను ప్రచురించారు. వాటి ఆధారంగా ఏ మార్గంలో అయినా దేశాన్ని వీడే, దేశంలోకి అడుగుపెట్టే వారి ఫొటోలు, డేటా సేకరణను యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ పెంచనుంది. ఫేక్ ట్రావెల్ పేపర్లను గుర్తించేందుకు, జాతీయ భద్రతను బలోపేతం చేసేందుకు డిసెంబర్ 26 నుంచి ఈ నిబంధనలను అమలు చేయనుంది. వివిధ మార్గాల్లో ఇమ్మిగ్రేషన్ చట్టాల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించేవారిని, వీసా గడువు ముగిసిన తర్వాత కూడా దేశంలోనే ఉంటున్నవారిని గుర్తించేందుకు వీలవుతుందని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఇక, 2021లోనే ఈ కొత్త నియంత్రణలు ప్రతిపాదించగా.. ఇప్పుడు పూర్తిస్థాయిలో సాంకేతికత ఉపయోగించి అక్రమవలసదారులకు చెక్ పెట్టనున్నారు. కాగా.. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అంటూ జాతీయవాదాన్ని బలంగా వినిపిస్తోన్న ట్రంప్ .. హెచ్-1బీ వీసాలకు సంబంధించి నిబంధనలు విధించారు. వాటి వార్షిక రుసుమును ఒకేసారి లక్ష డాలర్లకు పెంచేసి సంచలనం సృష్టించారు. అనంతరం పలు సవరణలు చేశారు. ఈ వీసా వ్యవస్థను సరిదిద్దడానికి, అమెరికన్లకు ప్రాధాన్యం ఇవ్వడానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లక్ష డాలర్ల ఫీజు నిర్ణయం తీసుకున్నారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లివిట్ వెల్లడించిన సంగతి తెలిసిందే.